నేటి నుంచి మల్లన్న ఉత్సవాలు


మణికొండ మల్లన్న ఆలయం

మణికొండ: మణికొండ మల్లన్న ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు బీరప్ప, మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ బి.జైహింద్‌రావు, అధ్యక్షుడు బి. ముత్యాలు, ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం గంగకు వెళ్లడం, రాత్రికి మల్లన్న ఒగ్గుకథతో షురూ అయ్యి సోమవారం మధ్యాహ్నం వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కొట్నం, 11:32 గంటలకు మల్లన్న స్వామి కల్యాణం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదానం, 2:30 గంటలకు సదర్‌పటం, గొలుసులు తెంపుట, 3 గంటలకు అగ్ని గుండాలు తొక్కడం, సాయంత్రం 5 గంటలకు ఎల్లమ్మ బోనాలు, రాత్రి 9 గంటలకు మల్లన్న చరిత్ర ఒగ్గుకథ ఉంటాయని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఒడిబియ్యం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. ఒగ్గు వీరేశం ఆధ్వర్యంలో కథలు, కల్యాణాలు, పెద్ద కురుమ జె.భిక్షపతి, చిన్న కురుమ బి.నర్సింహా ఆధ్వర్యంలో ఉత్సవాలు, దొడ్డి సత్తయ్య- వరలక్ష్మి, దొడ్డి శ్రీకాంత్-రేవతి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఆరాంఘర్ చౌరస్తాలో బస్ టెర్మినల్ నిర్మించాలి


ఆరాంఘర్‌లో నిరసన చేస్తున్న ఏఐటీయూసీ కార్యదర్శి జైపాల్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తాలో గల 44 నేషనల్ హైవేకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్ నిర్మించాలని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాటేదాన్ విలేజ్ సర్వే నంబర్ 54లో 4 ఎకరాల 18 గుంటలు, సర్వే నంబర్ 55లో 4 ఎకరాల 24 గుంటలు, సర్వే నంబర్ 56లో 7 ఎకరాల 18 గుంటలు మొత్తం 16 ఎకరాల 20 గుంటల భూమిని జీవో నంబర్ ఎంఎస్ 1406-1964లో అప్పటి ప్రభుత్వం ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్‌కు ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందులో ఉన్న మానసిక వికలాంగులు, వృద్ధులను వేరే ప్రాంతానికి తరలించి కబ్జా చేసేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. అయితే గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న డీఎస్ లోకేశ్‌కుమార్ సదరు భూమి కబ్జా కాకుండా చూడాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారన్నారు. అందులో 7 ఎకరాల 22 గుంటల భూమిని తీసుకొని బస్ టెర్మినల్ నిర్మించాలని రాష్ట్ర ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. బెంగుళూర్, తిరుపతి, కొల్లాపూర్, కర్నూల్‌కు ఇక్కడి నుంచే బస్సులు వెళ్తాయన్నారు. అందులో ఇంకా 8 ఎకరాల 38 గుంటల ప్రభుత్వ భూమి ఉండాలని, కానీ కొందరు కబ్జా చేశారని, వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల నాయకులు ఆనంద్ , సాయిలు, మహమ్మద్ ఖాజా, సత్యం, బాల్‌రాజ్ , జగన్, కృష్ణారెడ్డి, రాజు, నరేందర్, నరసింహ, నగేశ్ శ్రీహరి ఉన్నారు.

టిప్పర్ ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతి


కరుణాకర్(ఫైల్)

మణికొండ: రోడ్డు దాటుతున్న డీసీఎం డ్రైవర్‌ను ఓ టిప్పర్ ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట మూవీటవర్ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గన్నేరువారం గ్రామానికి చెందిన మునిగంటి కరుణాకర్ (45) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడ్‌తో నగరానికి వచ్చి మాలాలిలో కొంత దింపాడు. మిగిలింది కోకాపేటలో ఖాళీ చేసేందుకు గురువారం అర్ధరాత్రి వచ్చాడు. అయితే లేబర్లు లేకపోవడంతో వేచి చూస్తున్న అతను రోడ్డు దాటుతుండగా అటుగా వేగంగా వచ్చిన టిప్పర్ లారీ (టీఎస్ 08 యూడీ 6559) అతన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య సుశీల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేసవిలో ప్రతి ఇంటికీ తాగునీరు: ఎమ్మెల్యే కౌసర్


మలాయిమెట్‌లో నల్లాలో వస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: వేసవిలో ప్రతి ఇంటికీ తాగునీరు అందుతుందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్, మలాయిమెట్, తాళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల వారు తమ ఇళ్లల్లో నల్లాలో వస్తున్న నీరు తాగునీటి అవసరాలకు సైతం సరిపోవడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడుతూ.. ప్రధాన నీటి పైపునకు దూరంగా ఉన్న ఇళ్లకు లోప్రెజర్ సమస్య ఉండి ఉండవచ్చునని అంతేకాకుండా నీటి పైపులు దిగువ ప్రాంతంలో ఇళ్లు ఎగువ ప్రాంతంలో ఉండడం వల్ల కూడా లోప్రెజర్ సమస్య తలెత్తుతుందని ఆయన అన్నారు. ఇటువంటి ప్రాంతాల్లో బూస్టర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తానని ఆయన అన్నారు. ఇటువంటి ప్రాంతాలు కార్వాన్ నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాలు ఉన్నాయని ఆ ప్రాంతాల్లో బూస్టర్లు ఏర్పాటు చేయడం వల్ల లోప్రెజర్ సమస్య పరిష్కారం అయిందని అన్నారు. ఈ వేసవిలో ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు పక్కా ప్రణాళికతో జలమండలి అధికారులు ఉన్నారని ఆయన అన్నారు. ఇప్పటికే తాను జలమండలి ఉన్నతాధికారులతో వేసవిలో నీటి సరఫరాపై ప్రశ్నించడం జరిగిందని జలమండలి మెనేజింగ్ డైరెక్టర్ నీటి నిల్వ పుష్కలంగా ఉన్నాయని కార్వాన్ నియోజకవర్గానికి వేసవిలో సరిపడా తాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?


గుంతలమయంగా రోడ్డు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ టీచర్స్ కాలనీలోని రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి.దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సీసీ రోడ్డును తవ్వి అలాగే వదిలేశారు. దీంతో కనీసం నడిచేందుకు కూడా ఇబ్బందికి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు బస్తీని సందర్శించి సీసీ రోడ్డు వేయాలని వారు కోరుతున్నారు.

సవాళ్ల పరిష్కారానికి సాంకేతికతను ఉపయోగించాలి


యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్‌తో ముచ్చటిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్

రాయదుర్గం: ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్ళకు పరిష్కారాలను కనుగొనడానికి సాంకేతిక పురోగతిని ఉపయోగించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఎంటర్‌ప్రైజెస్(ఎస్పైర్) అసోసియేషన్ ఫర్ సైంటిఫిక్ పర్సూట్స్ 6వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం జీవ వైవిధ్యం మరొక ముఖ్యమైన సమస్యగా మారిందని, దీన్ని పరిరక్షించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విధులను సక్రమంగా నిర్వహిస్తూనే ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నా రు. మన దేశంలో మహిళలు సాధిస్తున్న ప్రగతిని మనం చూడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు పెంచడంలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఎస్పైర్ బయోనెస్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అనీల్ కొండ్రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన ఉండాలి


ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న ఎంఈవో రామిరెడ్డి


ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థిని

మండల విద్యాధికారి రామిరెడ్డి

- గణేశ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన
- సాధారణ ఎలక్షన్ మాదిరి ఓటింగ్
- విద్యార్థి లీడర్‌గా బన్నీ గౌడ్ గెలుపు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై అవగాహన ఉండాలని మండల విద్యాధికారి రామిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి ఆదేశాల మేరకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేశ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సాధారణ ఎన్నికల మాదిరిగా శుక్రవారం విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రచారం, ఓటు వేయడం, బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లు, చివరగా కౌంటింగ్ వంటి ప్రక్రియను నిర్వహించారు. మొత్తం 350 మంది విద్యార్థులకు గాను 12 మంది పోటీల్లో నిలిచారు. పాఠశాల లీడర్‌ని ఎన్నుకునేందుకు విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం హాల్‌లో కౌంటింగ్ నిర్వహించారు. ఎనిమిదో తరగతి విద్యార్థి బన్నీకి 76 ఓట్లు రాగా 21 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. అనంతరం బన్నీ పాఠశాల లీడర్‌గా ప్రశంసాపత్రం అందుకున్నాడు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఎన్నికలపై అవగాహన పెంపొందించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘుపతి, ఉపాధ్యాయుడు మాణిక్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిత్రులతో కలిసి పని చేస్తా..



పాఠశాలలో లీడర్ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 21 ఓట్లతో గెలిచాను. తోటి మిత్రులతో కలిసి పాఠశాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తాను. ఉపాధ్యాయులు చెప్పిన విధంగా పాఠాలను నేర్చుకోవడాన్ని విద్యార్థులకు తెలియజేస్తాను.

– బన్నీ, పాఠశాల లీడర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: కోకాపేట సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైర్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో ఓషియన్ పార్క్, బాబుఖాన్ విల్లాస్, 250 గజాల కాలనీ, లెజెండ్ విల్లాస్, పావని విల్లాస్, గండిపేట నుంచి శంకర్‌పల్లి రోడ్డు, ఘర్ కార్పొరేషన్, మైహోం లేబర్ క్యాంప్, అక్షయపాత్ర రోడ్, ప్రైవేట్ 28 విల్లాల ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ సస్పెన్షన్

మణికొండ: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలపై కాంగ్రెస్ కౌన్సిలర్‌ను జిల్లా అధ్యక్షుడు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ ఏడో వార్డు, నెక్నాంపూర్‌కు చెందిన కౌన్సిలర్ బి. పద్మారావు ఇటీవల మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కలెక్టర్‌కు ఇచ్చిన లేఖపై సంతకం చేశారు. అలాగే అవిశ్వాస తీర్మానం రోజు సమావేశానికి హాజరై చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. దాంతో గతంలోనే ఆయనకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. సరైనా వివరణ ఇవ్వక పోవడంతో ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసి, పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు చల్లా నర్సింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మణికొండ: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నార్సింగి క్రైం సీఐ శ్రీనివాస్ సూచించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఖానాపూర్, గండిపేట ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయణించేవారు సీటు బెల్టును తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం తాగి నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీరో కరెంట్ బిల్లుల పంపిణీ షురూ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో జీరో బిల్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆ శాఖ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ రీడింగ్‌ను సరిచేస్తూ బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా జీరో బిల్లులు వచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ సబ్ స్టేషన్ పరిధిలో దాదాపు 4500 మంది లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి


పెద్దతూప్రలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి ఉమాకాంత్

శంషాబాద్ రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ వి.ఉమాకాంత్ సూచించారు. కొత్వాల్‌గూడ, పెద్దతూప్రలో శుక్రవారం ఉచిత టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల చివరి వరకు కొనసాగుతుందని, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. పశువుల్లో అధిక జ్వరం, కాళ్లు , మూతికి పుండ్లు ఏర్పడడం ఈ వ్యాధి లక్షణాలు అని వివరించారు. కార్యక్రమంలో పశువైద్యులు నరోత్తంరెడ్డి, సిబ్బంది సుధాకర్‌గౌడ్, సంపత్, నరేశ్, అంజయ్య, నాగలక్ష్మి, జ్యోతి, దానయ్య, రైతులు పాల్గొన్నారు.

హోటల్‌లో కుళ్లిపోయిన చికెన్



కుళ్లిపోయిన చికెన్ ఆహార పదార్థాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ ఆధ్వర్యంలో అత్తాపూర్‌లోని శ్రీ వెంగమాంబ హోటల్‌లో శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఫ్రిజ్‌లో కుళ్లిపోయిన చికెన్, ఆహార పదార్థాలు చూసి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళ్లిపోయిన ఆహార పదార్థాలను సీజ్ చేసి రూ.50 వేల జరిమానా విధించారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో వెంగమాంబ హోటల్‌కు మంచి పేరుంది. అయితే కుళ్లిపోయిన ఆహార పదార్థాలు అందిస్తున్నా.. హోటల్‌ను సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


కారులో ఉన్న గంజాయి ప్యాకెట్లు

రాజేంద్రనగర్: కారులో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఓటీ పోలీసుల సహాయంతో రాజేంద్రనగర్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. నిందితుడి నుంచి మూడు సెల్‌ఫోన్లతో పాటు కారు, 124 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన వెంకన్న (26) స్థానికంగా ట్యాక్సీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వెంకన్నకు ఒడిషా రాష్ట్రానికి చెందిన సోమేశ్ పరిచయం అయ్యాడు. ఇల్లందు నుంచి జహీరాబాద్‌కు కారులో గంజాయిని తరలిస్తే రూ.10 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో గత నెల 29వ తేదీన మధ్యాహ్నం సోమేశ్ ఇల్లందు చేరుకొని 124 కేజీల గంజాయి పొట్లాలను కారులో వేసి జహీరాబాద్ ప్రాంతంలోని శివాజీకి అందించాలని సూచించాడు. జహీరాబాద్ వెళ్లగానే ఫోన్ చేస్తానని.. వాటిని అక్కడే ఇచ్చి కారులో తిరిగి రావాలని సూచించాడు. దీంతో వెంకన్న అదేరోజు సాయంత్రం బయలుదేరాడు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ హిమాయత్‌సాగర్ ఓఆర్ఆర్ వద్దకు శుక్రవారం ఉదయం రాగా అప్పటికే సమాచారం అందుకున్న ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. దీంతో వెంకన్నను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సోదా చేయగా 61 కవర్లలో భద్రపరిచిన 124 కేజీల గంజాయి లభ్యమైంది. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమేశ్, శివాజీ పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

పదేళ్ల రోడ్డు ప్రమాదాల్లో 1.3 మిలియన్ల మంది మృత్యువాత

రాయదుర్గం: భారతదేశంలో గత దశాబ్దకాలంలోనే రోడ్డు ప్రమాదంలో 1.3 మిలియన్ల మంది మృత్యువాత పడ్డారని యూనిసెఫ్ ఇండియా హెల్త్ స్పెషలిస్ట్ సయ్యద్ అలీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో రోడ్డు భద్రతపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం మృత్యువాతలతోపాటు మరో 5 మిలియన్ల మంది గాయపడ్డారని ఆయన వివరించారు. పిల్లల ఆరోగ్యం, మనుగడ, విద్య, రక్షణ భాగస్వామ్యం అవసరమన్నారు. ఆరోగ్యం శ్రేయస్సు, ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేసే ఒక ప్రధాన ప్రపంచ అభివృద్ధి సవాలుగా మారిందన్నారు. మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ విభాగం డీన్, హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ ఔత్సాహిక జర్నలిస్టులు, మీడియా నిపుణులు ట్రాఫిక్ పై అవగాహన కల్పించడం అవసరమన్నారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సయ్యద్ అలీ, వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ తదితరులు

మూసీ ఆక్రమణలు తొలగించండి


తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణికొండ: గండిపేట మండలం, మంచిరేవుల రెవెన్యూ పరిధిలో మూసీ నది పక్కనే రాజపుష్ప అనే సంస్థ నిర్మాణాలు చేపట్టి స్థల ఆక్రమణకు యత్నిస్తున్నాదని వాటిని వెంటనే తొలగించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం మూసీ నదిని అభివృద్ధి చేసేందుకు సుందరీకరణ , పర్యాటకంగా అభివృద్ధి చేసే దిశగా పనిచేస్తుంటే మంచిరేవులలో మాత్రం రాజపుష్ప సంస్థ దాన్ని మూసి వేస్తుందన్నారు. అధికారులు స్పందించి అనుమతులు రద్దు చేసి, ఆక్రమణలను తొలగించాలని విన్నవించామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సభ్యుడు ఓరుగంటి యాదయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మల్లేశ్, సీపీఐ మండల కార్యదర్శి ఎం. బాబురావు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ప్రారంభించిన జైపాల్‌రెడ్డి

మణికొండ: కోకాపేట గ్రామంలో శంకర కంటి ఆసుపత్రి వారు, గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యుడు, కోకాపేట మాజీ సర్పంచ్ ముంగి జైపాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిపేట మండలం పక్కనే ఉన్నత ప్రమాణాలతో కంటి ఆసుపత్రి ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఉచితంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. అలాగే నియోజకవర్గవ్యాప్తంగా సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, రెడ్డి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నియామకం


నియామక పత్రం అందుకుంటున్న కొండకళ్ల నాగేందర్‌రెడ్డి

రాజేంద్రనగర్: తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి సురభీ దివేది ఆదేశాల మేరకు కొండకళ్ల నాగేందర్ రెడ్డిని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఇన్‌చార్జిగా నియమించామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, నేషనల్ సెక్రటరీ జీశాన్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో యువత పాత్ర కీలకమని, ఆరు గ్యారెంటీల్లో నాలుగు హామీలు నేరవేర్చామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను ప్రజలకు వివరించి చేవెళ్ల సెగ్మెంట్‌లో కాంగ్రెస్ గెలుపునకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


ప్రధానోపాధ్యాయుడితో నవయువ యూత్ క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులకు వసతులు కల్పించేందుకు తమవంతు సహాయం అందిస్తామని నవయువ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి జడ్పీ పాఠశాలలో మరుగు దొడ్లలో నీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విద్యాకమిటీ చైర్మన్ గుత్తి నరేశ్ యూత్ క్లబ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సభ్యులు స్పందించి ప్లంబర్ జగన్, నరేశ్ సహకారంతో మరుగుదొడ్లలో నీరు, వాష్ రూమ్‌ల్లో నల్లాలను బిగించారు. దీంతో పాఠశాల ప్రధానోపాద్యాయుడు రాంచందర్ వారిని అభినందించారు.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు క్వాల్‌కామ్ గ్రాంట్

రాయదుర్గం: ఎడ్జ్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ రీసెర్చ్‌కు మద్దతు ఇవ్వడానికి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు క్వాల్‌కామ్ సంస్థ గ్రాంట్‌ను అందించింది. క్వాలాకామ్ టెక్నాలజీస్ సీనియర్ ఉపాధ్యక్షుడు లీండర్ట్‌వాన్‌డోర్న్ క్వాల్ కామ్ ఎడ్జ్ ఏఐ ల్యామ్‌ను శుక్రవారం ప్రారంభించారు. క్వాల్‌కామ్ ఎడ్జ్ ఏఐ ల్యాబ్ ఎడ్జ్, ఫండ్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌ల కోసం అల్గారిథమ్‌లపై పనిచేస్తుంది. క్వాల్‌కామ్ ద్వారా 186 అమెరికన్ డాలర్ల గ్రాంట్‌ను ప్రకటించింది. దీన్ని రాబోయే మూడేళ్ళపాటు ఎడ్జ్ ఏఐ రంగంలో పరిశోధన కోసం ఉపయోగిస్తారు.

ముఖ్యమైన ఖనిజాలు, లోహాల వెలికితీత ఎంతో అవసరం

రాయదుర్గం: భారతదేశంలో ముఖ్యమైన ఖనిజాలు, లోహాల వెలికితీత ఎంతో అవసరమని ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి సాహూ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని చాణక్య హాల్‌లో మూడు రోజుల జాతీయ స్థాయి సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధికి, ప్రస్తుత జీవన ప్రమాణాలకు ముఖ్యంగా ఇనుప ఖనిజం, బొగ్గు, అల్యూమినియం, ఇతర ఖనిజాల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. దీనికోసం ఒక జాతీయ విధానం, ఉక్కు ఉత్పత్తి పెంపు చాలా అవసరమన్నారు. ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం బొగ్గు మంత్రిత్వశాఖ ద్వారా 2025 నాటికి 1.5 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవసరమన్నారు. సదస్సులో 24 టెక్నికల్ పత్రాలను, మరో 29 సాధారణ పత్రాలను విద్యార్థులు సమర్పించారు. డాక్టర్ కౌశిక్‌సర్కార్, డాక్టర్ ఎస్‌కే చౌరాసియా, డాక్టర్ బాలమదేశ్వరన్, సురేష్‌కుమార్‌జైన్, ఎస్కీ అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.